క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ చోరీ

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వంట గదిలో గ్యాస్ సిలిండర్ చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగు చూసింది. శనివారం రోజులాగే వంట నిర్వాహకులు విద్యార్థులకు భోజనం పెట్టి, సాయంత్రం వంట గదికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. సోమవారం వచ్చే సరికి గది తాళాలు పగల గొట్టి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా గ్యాస్ సిలిండర్ అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డ్రోన్లతో రీసర్వే

సైదాపురం: మండలంలోని మొలకలపూండ్ల లో వైఎస్సార్ శాశ్వత భూహక్కు భూరక్ష పథకంగా భాగంగా డ్రోన్ల సహాయంతో పక్కాగా రీ సర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ హజరత్తయ్య తెలిపారు. మండలంలోని మొలకలపూండ్ల, దాడిశెట్టిపల్లెలో డ్రోన్ల సర్వేను సోమవారం ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్ కూకటి వెంకటేశ్వర్లు, వీఆర్వోలు హజరత్తయ్య, హైమావతి, సర్వేయర్ అరుణ్ పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

నాయుడుపేటటౌన్: మండలంలో ఉగాది వేడుకలకు పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని శ్రీవల్లిదేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణేశ్వరస్వామి వారి ఆలయంలో ఉగాది సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు చదలవాడ మోహన్‌కష్ణశర్మ సోమవారం తెలిపారు. ఉదయం రాజగోపురం వద్ద ఉన్న రామాలయం నుంచి 108 కలశాల్లో ద్రవ్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అభిషేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని పలు ఆలయాల్లో ఉగాది వేడుకలు నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇద్దరి నేత్రదానం


మునస్వామి, మల్లెమ్మ

సూళ్లూరుపేట: పట్టణంలోని గాండ్ల వీధికి చెందిన కల్లేటి మునస్వామి (70), సాయినగర్‌కు చెందిన ఓసూరు మల్లెమ్మ (65) సోమవారం మృతి చెందడంతో వారి నేత్రాలను ఆయా కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు వీరి కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయ వారికి అందజేశారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి




రాపూరు: ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంగ్రామయాత్రలో భాగంగా రాపూరులో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, శీను, ప్రణయ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిల్లకూరు: మండలంలోని కోట క్రాస్ రోడ్డులో గత ఫిబ్రవరి నెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి సోమవారం వేకువజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నక్కల కాలువ కండ్రిగకు చెందిన తేరూరు వెంకయ్య (66) అనే వ్యక్తి రిక్షాపై ముగ్గు పిండి విక్రయించుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో గత ఫిబ్రవరి నెల 26వ తేదీ వేకువజామున రిక్షాపై ముగ్గు పిండి తీసుకుని గూడూరు వైపు బయలు దేరాడు. రోడ్డుపైకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడికి తిరుపతిలో చికిత్స చేస్తుండగా సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి ఏపీఓ, ఈసీపై ఫిర్యాదు



పెళ్లకూరు: ఉపాధిహామీ పథకం ఏపీఓ దయానంద్, ఈసీ భానుశేఖర్ పనితీరుపై స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హౌసింగ్ ఈఈ ఎంవీ మోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం గూడూరులోని హౌసింగ్ కార్యాలయంలో ఈఈని కలిసి నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. మొత్తం 24 పంచాయతీల్లో జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి రూ.64 లక్షల మేరకు లెవలింగ్ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అయితే ఏపీఓ, ఈసీ నిర్లక్ష్యం వల్లే నిధులు మంజూరు కాలేదని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు లింగమనాయుడు, రఘునాయుడు, కుమార్‌స్వామి, కృష్ణయ్య, జితేంద్ర పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి రూరల్: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల నుంచి పంటలు కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ నాగార్జున సాగర్ సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వీఏఏలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉందని, రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పంట నష్టం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వరికోత ప్రయోగంపై వీఏఏలకు శిక్షణ ఇచ్చారు. ఏఓ సుజాత, ఏఎస్ఓ కోటేశ్వరరావు, ఏఈఓ రామ్మోహన్, గోపి పాల్గొన్నారు.

భారీవర్షం.. రోడ్లన్నీ జలమయం


జలమయమైన సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డు

సూళ్లూరుపేట: పట్టణంలో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు ఉన్నపళంగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాండ్లవీధి, సాయినగర్ సెంటర్, హోలీక్రాస్ సెంటర్‌తో పాటు వినాయకుడి గుడి సెంటర్ నుంచి ఉత్తరం వైపు చెంగాళమ్మ ఆర్చి వరకు ఉన్న జీఎన్‌టీ రోడ్డంతా జలమయమం అయ్యింది. పలుచోట్ల చెట్లు పడిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మిరప, కోతదశలో ఉన్న వరి పంట నేలవాలింది. దొరవారిసత్రం, సూళ్లూరుపేట ప్రాంతాల్లో పత్తి, పుచ్చ పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అకాల వర్షంతో కర్బూజకు దెబ్బ

దొరవారిసత్రం: మండలంలోని పలుప్రాంతాల్లో సాగు చేసిన సుమారు 60 ఎకరాల కర్బూజ పంట అకాల వర్షం కారణంగా దెబ్బతినిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మూడు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం పలుచోట్ల వర్షం కురిసింది. ఇప్పటివరకు కురిసిన వానలకు మినమనముడి, కల్లూరు, ఆనేపూడి, సూరపుఅగ్రహారం తదితర ప్రాంతాల్లో సాగు ఉన్న కర్బూజ నీట మునిగి దెబ్బతిందని రైతులు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సైదాపురం: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం ఏఓ హైమావతి పరిశీలించారు. మండలంలోని కమ్మవారిపల్లె, గంగదేవిపల్లె, అనంతమడుగు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను ఏఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తక్షణమే పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. తడిసిన వరి ఓదెలపై రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. 33 శాతం పైబడి పంట నష్టం జరిగిన వివరాలను సేకరించి, నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.




వినాయకుడి సెంటర్‌లో నిలిచిన వర్షపునీరు, కల్లూరులో కర్బూజ పంటలో నిలిచిన నీటిని తీస్తున్న రైతు, పంటను పరిశీలిస్తున్న ఏఓ హైమావతి

క్రీడా పరికరాల పంపిణీ


పరికరాలు అందజేస్తున్న వెంకటరమణారెడ్డి

రాపూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలకు సోమవారం క్రీడా పరికరాలు అందజేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెండు పాఠశాల హెచ్‌ఎంలు పాఠశాలలకు క్రీడా పరికరాలు అందించాలని తనని గతంలో కోరారని చెప్పారు. ఈ విషయాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన దీనిపై స్పందించి, సొంత నిధులు రూ.50 వేలు వెచ్చించి, వివిధ రకాల క్రీడా పరికరాలు అందించారని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం పరికరాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు దయాకర్, రేణుక మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంటనే స్పందించి విద్యార్థులకు క్రీడా పరికాలు అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రకాష్, పెంచలయ్య, సంజీవరెడ్డి, పీడీ విజయకుమారి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దొరవారిసత్రం: అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దొరవారిసత్రం ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. ఇందుకోసం ఏప్రిల్ 7వ తేదీలోపు http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత విద్యాచట్టం ప్రకారం అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల వారికి 6 శాతం మొత్తం 25 శాతం సీట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఒకటో తరగతిలో ఉచితంగా చేరాలనుకునే వారు కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లోని వారికి రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో వారికి రూ.1.40 లక్షల ఆదాయం మించకూడదని తెలిపారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


పెళ్లకూరు: పాలచ్చూరులో ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

ఓజిలి: ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రజనీకాంత్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఓజిలి, గ్రద్దగుంట సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వలంటీర్లు పంచాయతీల్లో పర్యటించి, ఆధార్ నమోదు చేసుకోని వారి వివరాలను సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు అందించాలన్నారు. ఈ ఆధార్ కేంద్రాల్లో 5–15 ఏళ్లలోపు వారికి ఆధార్ నమోదు చేయడం, ఆధార్ కార్డులో చిరునామా, ఫోన్ నంబర్, వేలిముద్రలు నమోదు చేస్తామని తెలిపారు. 21వ తేదీ ఈ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేస్తామని చెప్పారు.

పెళ్లకూరు: సచివాలయాల్లో అందిస్తున్న ఆధార్‌సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు. సోమవారం పాలచ్చూరు, చెంబేడు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రదానం


తమిళనాడు గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న మల్లికార్జునరెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ పీడీగా పనిచేస్తున్న వి.మల్లికార్జునరెడ్డి వ్యాయామవిద్యలో చేసిన పరిశోధనలకుగాను తమిళనాడు కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేసింది. యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం సందర్భంగా ఆదివారం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్, రాష్ట్రమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేతుల మీదుగా పీహెడీ డిగ్రీ అందుకున్నారు. సోమవారం కళాశాలలో మల్లికార్జున్ రెడ్డిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ


విచారణ జరుపుతున్న అధికారులు

కోట: మండలంలోని తిన్నెలపూడి, వెంకన్నపాళెం పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మిపై ఫిర్యాదులు రావడంతో సోమవారం గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ విచారణ జరిపారు. శ్రీలక్ష్మి విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, మూడు నెలలుగా సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు జీతాలు పెట్టలేదని, కిబో అనే ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నట్లు స్థానికులు కొందరు ఆమెపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వెంకన్నపాళెం సచివాలయానికి చేరుకున్న అధికారులు పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి విచారణ జరిపారు. పలువురిని ప్రశ్నించి, ఆధారాలు సేకరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని డీఎల్‌పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ, సీనియర్ అసిస్టెంట్ శర్మ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతోనే రాణింపు


ఎంఈఓ వెంకటేశ్వరరావు, ఆర్టిస్ట్ శంకర్‌ను సత్కరిస్తున్న మురళి తదితరులు

వెంకటగిరి: విధి నిర్వహణ, తాము ఎంచుకున్న రంగంలో అంకితభావంతో పనిచేసేవారు రాణిస్తారని 13వ వార్డు మిత్రమండలి సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అర్జునగారి మురళి అన్నారు. ఆ మండలి ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు, పెన్సిల్ కళాకారుడు పి శంకర్‌బాబుకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఎంఈఓ వెంకటేశ్వరరావు ఉత్తమసేవలను గుర్తించి ఇటీవల అవార్డు రావడం, పెన్సిల్ ఆర్టిస్ట్ శంకర్‌బాబు నెల్లూరు హరివిల్లు క్రియేషన్స్– 25 కళా సంఘాలు ఆధ్వర్యంలో నెల్లూరు జరిగిన ఉగాది పురస్కారాన్ని అందుకున్న నేపథ్యంలో సత్కరించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, చెంచుకుమార్, సుబ్బరాయులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమాలకు పాల్పడితే కేసులు


మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి

వెంకటగిరి: అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. పట్టణంలోని చెవిరెడ్డిపల్లె చినచెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. తవ్వకాలకు పాల్పడినవారిని గుర్తించి వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ చెరువుల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై రెవెన్యూ సిబ్బందితోపాటు ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, సచివాలయ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇరిగేషన్‌శాఖ ఏఈ బాబు పాల్గొన్నారు.

ఘర్షణ... వ్యక్తిపై దాడి

ఓజిలి: పొలం విషయమై జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన ఓజిలి మండలం మనవాలిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నరవాడ శ్రీనివాసులుకు చెందిన పొలాన్ని ఆయన అన్న కుమారుడైన సుధాకర్ ట్రాక్టర్‌తో అక్రమంగా దున్నుతుండగా శ్రీనివాసులు అడ్డుకున్నాడు. పొలం వద్ద ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో శ్రీనివాసులపై సుధాకర్ కల్లుగీసే కత్తితో దాడి చేశాడు. దీంతో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు క్షతగాత్రుని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ దారం ఆదిలక్ష్మి సంఘటన స్థలం చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కోట: మండలంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ రమేష్‌కుమార్ అధికారులకు సూచించారు. చిల్లకూరు మండలం పల్లమాల నుంచి కోట మండలంలోని కోట, తిమ్మనాయుడుపాళెం, వంజివాక గ్రామాల మీదుగా వాకాడు మండలం తూపిలిపాళెం వరకు రూ.19.5కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. సీఈ మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం ప్రజలకు ఉపయోగకరమన్నారు. రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటిస్తున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ శివకుమార్, ఈఈ గీతావాణి, డీఈ అరుణమ్మ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి


పన్ను వసూలులో పాల్గొన్న కమిషనర్

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీని అందరు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. పలు సచివాలయాల పరిధిలో వార్డు కార్యదర్శులు, మున్సిపల్ బిల్ కలెక్టర్‌తో వసూలు చేస్తున్న ఇంటి పన్నుల వివరాలను కమిషనర్ సోమవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటి, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్నులు వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని, అయినా ఇంతవరకు పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న వారికి అవగాహన కల్పించి ఈనెల 31 తేదీలోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని కమిషనర్ సూచించారు. 13 సచివాలయల్లో పాత బకాయిలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి, వసూళ్లు చేయాలని ఆయన ఆదేశించారు.

స్వల్పకాల కోర్సుల్లో శిక్షణ

తడ: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2023–24 సంవత్సరంలో స్వల్పకాల కోర్సుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎం దేవదానం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ, మాన్యువల్/షీల్డెడ్ మెటల్ ఆర్క్ వెల్డింగ్, అసిస్టెంట్ మాన్యువల్/ షీల్డెడ్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ తదితర మూడు నెలల కోర్సుల్లో శిక్షణ ఇప్పించి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ తడలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. మరిని వివరాలకు కళాశాల జూనియర్ అసిస్టెంట్ నరసరాజు 9390517937, చెన్నయ్య స్కిల్ హబ్ కోఆర్డినేటర్ 8639835953 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

గూడూరు: ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూసిన మహిళలు స్వచ్ఛ అవార్డులకు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ పారిశుద్ధ్యంతోపాటు, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరచడంతోపాటు, వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్నతరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకు శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, మురుగు నీటిని శుద్ధి చేసి, తిరిగి వినియోగించే పద్ధతులు, చెత్తతో కళాకృతులు, సంపద తయారీ, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, తదితర విభాగాల్లో ఈ అవార్డులు అందజేస్తారన్నారు. ఎంపికైన వారికి జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేస్తామని చెప్పారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి.. పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నియోజకవర్గంలో ఈనెల 24 నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అమలు చేస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాసంలో సోమవారం నేదురుమల్లిని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుంచి వెంకటగిరి నియోజకవర్గంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్ మండలం, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లోని ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని సందర్శించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు పథకాలు అందని వారికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను గుర్తించి, అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రతి గడప గడపకూ పారదర్శకంగా అందిస్తున్నారని, పార్టీ పరంగా ఏర్పాటు చేసిన సచివాలయ సారథులు, గృహ సారథులు సైతం వారి వారి పరిధిలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో ఎమ్మెల్యే కిలివేటి భేటీ



సూళ్లూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి జగన్‌మోహన్ రెడ్డిని కలిసి నియోజకవర్గం సమస్యలను వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కావాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి, మీ నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారని ఎమ్మెల్యే కిలివేటి తెలిపారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ

గూడూరు: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాయంలో సోమవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని అన్ని మండలాల నుంచి పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలకు అర్జీలను బాధితుల నుంచి ఆయన స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు దినాల్లో తప్ప మిగిలిన రోజుల్లో సచివాలయాల్లో కూడా మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకూ అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

తహసీల్దార్లతో ఆర్డీఓ సమీక్ష

స్థానిక ఆర్డీఓ కిరణ్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఉన్న సీజేఎఫ్, అసైన్డ్‌మెంట్, సాగరమాల ప్రాజెక్టు, నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైను, అలాగే ప్రభుత్వ భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రీ సర్వే, పీఓఎల్ఆర్, 6బీ సేకరణ తదితరాలపై ఆయన అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీటీలు, సర్వేయర్లు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం

చిల్లకూరు: పొగాకు ఉత్పత్తులతో వచ్చే నోటి క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని గూడూరు ఏరియా ఆస్పత్రి దంత వైద్య నిపుణులు మోహన సూచించారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఓడూరు పంచాయతీ పున్నపువారిపాళెంలోని పెన్వర్ ఆక్వా పరిశ్రమలో కార్మికులకు సోమవారం నోటి క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నోరు ఎంత శుభ్రంగా ఉంచుకోవాలనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురికి దంత పరీక్షలు చేశారు. ఎన్‌టీసీపీ సోషల్ వర్కర్ లలిత, సీహెచ్‌ఓ సుదీప్తి ప్రియాంక, సునీల్‌కుమార్, రమణమ్మ సుబ్బరత్నమ్మ, పర్యవేక్షలు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు బస్సు, ఐషర్ ఢీ

తడ: తమిళనాడుకు చెందిన ఆర్టీసీ బస్సును జాతీయ రహదారిపై ఐషర్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు గాయపడిన సంఘటన సోమవారం బీఎల్‌పాగు గ్రామం వద్ద జరిగింది. ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న తమిళనాడుకు చెందిన 200 బస్సు బీఎల్‌పాడు జాతీయ రహదారి మలుపు తిరుగుతున్న సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వెళుతున్న ఐషర్ లారీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని శివంగిరి ప్రాంతానికి చెందిన హరికృష్ణ భార్య సరస్వతి, కుమార్తె సంజన(13)కు తీవ్ర గాయాలయ్యాయి. తమిళనాడు, ఆరణి సమీపంలోని కుమ్మరిపేటకు చెందిన శివ, అతడి భార్య లలిత గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సరస్వతి, సంజన పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని చెన్నై తరలించారు.

క్రీడలతో మానసికోల్లాసం


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

గూడూరు: క్రీడలతో ఒత్తిడిని తగ్గించుకుని, మానసికోల్లాసం పొందవచ్చని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరావు పేర్కొన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ గూడూరు శాఖ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులకు మద్రి రాఘవయ్య క్రికెట్ టోర్నమెంట్‌ను సోమ వారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో కూడిన ఉద్యోగం చేస్తున్న రైల్వే ఉద్యోగులకు అటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, నాగరాజు, సుందరం, శ్రీని వాస్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, కార్తీక్, రమణయ్య, రాజాబాబు,శీను, మయూరి శ్యామ్‌యాదవ్ పాల్గొన్నారు.